క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్‌ వర్ధంతి

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట కల వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ వర్ధంతి నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నేడు వనమా బాల వజ్రబాబు పర్యటన

తాడికొండ: వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వనమా బాల వజ్రబాబు (డైమండ్‌ బాబు) నేడు తొలిసారిగా నియోజకవర్గంలో పర్యటించనున్నారు. తాడికొండ మండలం లాం గ్రామం నుంచి నాయకులు కార్యకర్తలతో కలిసి కార్ల ర్యాలీగా బయలుదేరి తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామంలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ వర్ధంతిని పురస్కరించుకొని మార్గమధ్యలో లాం, తాడికొండలోని అంబేడ్కర్‌ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. ఈ నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా పాస్టర్ల సదస్సు



తాడేపల్లిరూరల్: క్రిస్మస్‌ మాసాన్ని పురస్కరించుకుని క్రైస్తవ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి బాప్టిస్ట్‌ పేట లార్డ్‌ జీసస్‌ చర్చిలో పాస్టర్లకు సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు రెవరెండ్‌ కంతేటి లార్డ్‌ వెస్లీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లోకంలో ఒక్కడే రక్షకుడు ఉన్నాడని, ఆయనే ఏసుక్రీస్తు అని, ఆయన్ను నమ్మినవారిని పరలోకానికి నడిపించేది ఏసుక్రీస్తే అని వివరించారు. అనంతరం ప్రేమవిందు, కానుక కార్యక్రమాన్ని నిర్వహించారు. పాస్టర్లు సీహెచ్‌ డేవిడ్‌ గాంధీ, పి.డేవిడ్‌ రాజు, పి.విద్యాధర్‌, ఎస్‌.బాలస్వామి, ఎం.ఇశ్రాయేల్‌, స్వర్జన్‌ బాబు, రబ్బుని, డి.ప్రసాదరావు, మహిమ శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు మంగళగిరి పరిసర ప్రాంతాలతో పాటు విజయవాడ, గుంటూరు నగరాల నుంచి సుమారు 600 మంది పాస్టర్లు విచ్చేశారు.

మేడికొండూరు తహసీల్దార్‌గా హరిబాబు బాధ్యతలు స్వీకరణ



మేడికొండూరు: మేడికొండూరు నూతన తహసీల్దార్‌గా ఎం.హరిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం తహసీల్దార్‌గా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా మేడికొండూరు వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి తహశీల్దార్‌గా పనిచేసిన కళ్యాణి గుంటూరు కలెక్టరేట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ హరిబాబు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పనిచేస్తానని తెలిపారు.

అలరించిన సంకీర్తన గానం

తెనాలి: పట్టణ నెహ్రూ రోడ్‌లోని శ్రీ రుక్మిణీ సమేత గోవర్ధనస్వామి, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం శ్రీ హరినామ సంకీర్తన బృందం ఆధ్వరంలో సంకీర్తన గానం నిర్వహించారు. గురువు పెరవలి వంశీకృష్ణ, అందె బాలచంద్రమౌళి, అందె రాజేశ్వరి, తన్మయి, మాదలనాగఅర్చన, రూపశ్రీ, నందిపాటి దుర్గామల్లేశ్వరి, దంటు శర్వాణి, పువ్వాడ విష్ణు ప్రియ, శ్రీపూజిత, కొప్పురపు అనిత మాధవి, టీవీఎస్‌ శాస్త్రి పాల్గొన్నారు. శ్రీఆంజనేయస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానములు సహకారంతో 'వారం వారం భజన'లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొద్ది రోజుల్లో తిరుమలలో ఇదే బృందంతో భక్తిరంజని ఉంటుందని పెరవలి వంశీకృష్ణ చెప్పారు.

రీ సర్వేకు ప్రజలంతా సహకరించాలి



తెనాలి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో భూములకు సంబంధించిన రీసర్వే జరుగుతుందని, ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్‌ కమిషనర్‌ బండి శేషన్న కోరారు. తహసీల్దార్‌ కార్యాలయం ఆవరణను గురువారం సాయంత్రం రీసర్వే చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్వత భూ హక్కు పథకంలో భాగంగా తెనాలి పట్టణంలో రీ సర్వేను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొదట ప్రభుత్వ భవనాలను, తరువాత ప్రైవేట్‌ ఆస్తులను రీసర్వే చేయనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో తహసీల్దార్‌ గోపాలకృష్ణ, ఏసీపీ శివన్నారాయణ, పలువురు టౌన్‌ ప్లానింగ్‌, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హాయ్‌ల్యాండ్‌కే జై.. రైతులకు నయ్‌!

- ఆర్‌అండ్‌బీ రహదారిలో నిర్మించాల్సిన ఫ్లై ఓవర్‌, అండర్‌పాస్‌ హాయ్‌ల్యాండ్‌ రోడ్డులో నిర్మాణం
- తమకు ఆర్‌అండ్‌బీ రోడ్డు వద్ద అండర్‌ పాస్‌ కావాలని పోరాడుతున్న రైతులు
- రైతుల గోడు పట్టించుకోని ప్రభుత్వం



హాయ్‌ల్యాండ్‌ రోడ్డులో వేసిన ఫ్లై ఓవర్‌ అండర్‌ పాస్‌

మంగళగిరి: జాతీయ రహదారి ఫ్లై ఓవర్‌ వద్ద అండర్‌పాస్‌ విషయమై పదిహేనేళ్లకుపైగా తాము పోరాడుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... విజయవాడకు వెళ్లే జాతీయరహదారిపై ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రభుత్వం గుంటూరు జిల్లా చినకాకాని నుంచి నిడమర్రు, యర్రబాలెం, నవులూరు, తుళ్లూరు మండలం వెంకటపాలెం మీదుగా కృష్ణా నదిపై వంతెన నిర్మాణంతో కృష్ణా జిల్లా గొల్లపూడి మీదుగా పశ్చిమగోదావరి జిల్లా పూళ్ళ వరకు జాతీయ రహదారి నిర్మాణం చేపట్టింది. ఇందులో మూడు ప్యాకేజీలుగా పనులు చేపట్టింది. గుంటూరు జిల్లా చినకాకాని నుంచి కృష్ణా జిల్లా గొల్లపూడి వరకు రూ.1682 కోట్లతో నిర్మాణం చేపట్టింది. అయితే అనివార్య కారణాలతో కొద్దికాలం నిర్మాణం ఆగగా.. మరలా నిర్మాణ పనులు చేపట్టారు.

దారిలేక ఇబ్బందులు...

గత పదిహేను సంవత్సరాలుగా హాయ్‌ల్యాండ్‌ పక్కన కల ఆర్‌అండ్‌బీ రోడ్డులో అండర్‌పాస్‌ నిర్మాణం చేపట్టాలని రోడ్డు నిర్మాణ సమయం నుంచి రైతులు కోరుతున్నారు. హాయ్‌ల్యాండ్‌ యాజమాన్యం అగ్రిగోల్డ్‌ కుంభకోణంలో ఇరుక్కోవడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వంలోని ప్రభుత్వ పెద్దలు కొనుగోలు చేసిన నేపథ్యంతో రోడ్డు అండర్‌ పాస్‌ నిర్మాణం మారిందని రైతులు చెబుతున్నారు. అండర్‌ పాస్‌ నిర్మాణం మారడంతో తమకు సరైన దారి లేక పొలాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందిపడుతున్నామని, గేదెలను మేతకు తోలకెళ్లలేకపోతున్నామని వాపోతున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా స్పందిండంలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి తమకు ఉపయోగపడే ఆర్‌అండ్‌బీ రోడ్డులో అండర్‌పాస్‌ నిర్మించాలని రైతులు కోరుతున్నారు.



చినకాకాని వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిలో గతంలో ఫ్లై ఓవర్‌కు కేటాయించిన స్థలం

ప్లాన్‌ మార్చారు...



ఆర్‌అండ్‌బీ రోడ్డులో అండర్‌పాస్‌ నిర్మించాలని తొలి నుంచి ప్లాన్‌లో ఉంది. అయితే హాయ్‌ల్యాండ్‌ యాజమాన్యం మారిన తర్వాత ప్లాన్‌ సైతం మారింది. ఎన్నో సంవత్సరాలుగా రైతులు చేస్తున్న విజ్ఞప్తిని పట్టించుకోకుండా హాయ్‌ల్యాండ్‌ నుంచే అండర్‌ పాస్‌ నిర్మాణం చేపడుతున్నారు. మంత్రులకు, అధికారులకు వినతిపత్రాలు అందజేశాం. ఇప్పటికైనా ప్రభుత్వం అండర్‌ పాస్‌ నిర్మాణం ప్లాన్‌ మార్చి రైతులకు ఉపయోగపడేలా మరో అండర్‌ పాస్‌ నిర్మించాలి.

– గాదె చంద్రశేఖర్‌రెడ్డి, రైతు

చుట్టు తిరిగి వెళ్తున్నాం..



జాతీయ రహదారి నిర్మాణం చేపట్టిన సమయంలో అండర్‌ పాస్‌ నిర్మాణం ఆర్‌అండ్‌బీ రోడ్డు వద్దనే అని చెప్పారు. మళ్లీ ప్లాన్‌ మార్చి హాయ్‌ల్యాండ్‌లో చేపట్టారు. నాకు ఆర్‌అండ్‌బీ రోడ్డులో పొలం వుంది. ఇప్పుడు అండర్‌ పాస్‌ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ చుట్టు తిరిగి వెళ్తున్నాం. ఇప్పటికైనా రైతులకు ఉపయోగపడేలా అండర్‌ పాస్‌ నిర్మించాలి.

– సుంకర ప్రసన్నకుమార్‌, రైతు, చినకాకాని

పల్లెకు చేరిన బ్యాటరీ దొంగలు

ఆందోళన చెందుతున్న వాహన యజమానులు



చిర్రావూరులో ఇంటిముందు పెట్టిన వ్యవసాయ ట్రాక్టర్‌ నుంచి తొలగించిన బ్యాటరీ కేస్‌

తాడేపల్లిరూరల్: నిన్న మొన్నటి వరకు వాహనాల్లో బ్యాటరీలో దొంగతనం చేసేవారు తాడేపల్లి పట్టణ పరిధికే పరిమితమయ్యారు. తాజాగా గురువారం తెల్లవారుజామున చిర్రావూరులోని ఓ వ్యక్తి ఇంటి ముందు ఉంచిన వ్యవసాయ ట్రాక్టర్‌ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బ్యాటరీ చోరీ చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గతంలో ఎన్నడూ పల్లెటూర్లలో వాహనాల్లో బ్యాటరీలు చోరీకి గురికావడం లేదని, గత వారం రోజులనుంచి మూడు గ్రామాల్లో ఇంటిముంగిట పార్కింగ్‌ చేసిన వాహనాల్లో బ్యాటరీలు అపహరణకు గురి అవుతున్నాయని, ఒక్కొక్క బ్యాటరీ విలువ రూ.7 వేలు ఉంటుందని, వైర్లు కూడా కోసివేయడం వల్ల వాటి మరమ్మతుల నిమిత్తం మరో రూ.వెయ్యి అదనంగా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రాత్రిళ్లు గస్తీ నిర్వహించాలని, లేకుంటే వాహనదారులకు ఇలాంటి ఇబ్బందులు తప్పవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

కొనసాగుతున్న 'ఏసీసీ' కార్మికుల దీక్షలు



దీక్ష నిర్వహిస్తున్న ఏసీసీ సిమెంట్‌ ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురం ఏసీసీ సిమెంట్‌ ఫ్యాక్టరీ కార్మికులు తమ గుడిసెలను ప్రభుత్వ అధికారులు అక్రమంగా కూల్చివేయడాన్ని నిరసిస్తూ చేపట్టిన దీక్షలు గురువారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా సిమెంట్‌ ఫ్యాక్టరీ కార్మికుల పోరాట కన్వీనర్‌ కూరపాటి స్టీవెన్‌ మాట్లాడుతూ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటం ఉధృతం చేద్దామన్నారు. చట్టవిరుద్ధంగా కార్మికులు గుడిసెల కూల్చివేయించిన అధికారులు తగిన సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేశారు. సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ చట్టవిరుద్ధంగా అధికారులు వ్యవహరించడం సరి కాదని అన్నారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి సీఐటీయూ పూర్తి సంఘీభావం తెలియజేస్తోందని అన్నారు. ఈ దీక్షా శిబిరంలో కూరపాటి దిబోరా రాణి, ఎం.శారద, జి.అన్నమ్మ, బి.నవనీతం, మల్లికాంబ, డి.రమణ, ఎం.ఆశీర్వాదం, బి.సూర్య ప్రకాష్‌, సుబ్బారావు, ఎం.గురవయ్య, యెహోషువా, ఎం.శివ మల్లేశ్వరి, పిచ్చయ్య, ఆర్‌.శివ, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంటీఎంసీ కార్యాలయం వరకు పాదయాత్ర

చట్టవిరుద్ధంగా అధికారులు తమ గుడిసెలు కూల్చివేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఫ్యాక్టరీ దీక్షా శిబిరం నుంచి మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు యూనియన్‌ నాయకులు కూరపాటి స్టీవెన్‌ తెలిపారు. ఈ పాదయాత్రలో కార్మికులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

బహిరంగ ప్రదేశాల్లో మందులు దహనం

విచారణ జరుపుతున్న వైద్యాధికారులు



బూడిదైన మందులు

తెనాలి అర్బన్: పేదలకు పంపిణీ చేయాల్సిన మందులను అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ ఉద్యోగులు బహిరంగ ప్రదేశంలో దహనం చేయడం సంచలనంగా మారింది. ఈ సంఘటన తెనాలి సుల్తానాబాద్‌లోని అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ వద్ద గురువారం ఉదయం వెలుగు చూసింది. వివరాలోకి వెళితే .. తెనాలి సుల్తానాబాద్‌లో అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రోగులను అవసరమైన మందులను ప్రభుత్వం సరఫరా చేసింది. వాటిలో సుమారు 25 బాక్స్‌ల మందులను సమీపంలో చెత్త వేసి తగుల పెట్టారు. స్థానికులు గమనించి మీడియాకు సమాచారం ఇచ్చారు. వీటికి గత నెలలో కాల పరిమితి ముగియడంతో సిబ్బంది తగులబెట్టినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. సుల్తానాబాద్‌లోని అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ ముందు మందులను తగులపెట్టిన విషయం తన దృష్టికి వచ్చిందని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్‌ అన్నపూర్ణ తెలిపారు. కాలపరిమితి ముగిసిన మందులను నిబంధనల ప్రకారం బయో మెడికల్‌ వెస్ట్‌ను సేకరించే సిబ్బందికి అందజేయాల్సి ఉందని చెప్పారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా దహనం చేయడంపై విచారణ జరుపుతున్నామని చెప్పారు. ఎన్ని బాక్స్‌ల మందులు తగులపెట్టారు ? అనే విషయం తెలియాల్సి ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఘనంగా క్రిస్మస్‌ ఉదయ కాల ప్రార్థనలు



తెనాలి: పట్టణ అయితానగర్‌ ప్యాడిసన్‌పేటలోని ఈరే న్యూ లైఫ్‌ ఫ్యామిలీ వర్షిప్‌ సెంటర్‌లో నవంబర్‌ 25 నుంచి ప్రారంభమైన క్రిస్మస్‌ మాస ఉదయ కాల ప్రార్థనలు మహిమకరంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం జరిగిన ప్రార్థనలో పలువురు దైవజనులు పాల్గొన్నారు. తెనాలి యునైటెడ్‌ టౌన్‌ పాస్టర్స్‌ అసోసియేషన్‌ మాజీ అధ్యక్షుడు, ఈరే మినిస్ట్రీస్‌ అధ్యక్షుడు బిషప్‌ కె.సుధీర్‌ కుమార్‌ మాట్లాడుతూ క్రీస్తు పుట్టుక ఈ లోకానికి వెలుగని చెప్పారు. ఉదయకాల ప్రార్థనతో అనేక ఆశీర్వాదాలు కలుగుతాయని చెప్పారు. ఈనెల 25వ తేదీ క్రిస్మస్‌ వరకు ఈ ఉదయకాల ప్రార్థనలు జరుగుతాయని వెల్లడించారు. దైవజనులు వై.కృపాదానం, పి.గిద్యోను, బ్రదర్‌ ఆనందన్న, రెవరెండ్‌ పి.శామ్యూల్‌, బ్రదర్‌ అబ్రహంరెడ్డి బోయిన, రెవరెండ్‌ మార్పు స్టీఫెన్‌, రెవరెండ్‌ గాబ్రియేలు, జోసఫ్‌ చిట్టిబాబు దానియలురాజు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

దుగ్గిరాల మండల స్పెషల్‌ ఆఫీసర్‌ సాయికుమార్‌



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టించాలని దుగ్గిరాల మండల స్పెషల్‌ ఆఫీసర్‌ మరియు గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్‌ అన్నారు. గురువారం మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో ఆయన విస్తృతంగా పర్యటించారు. అనంతరం కంఠంరాజు కొండూరులోని సంపద కేంద్రం భవనాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తలను విడివిడిగా భద్రపరచి వాటి నుంచి తప్పనిసరిగా సంపద సృష్టించి అవసరమైన రైతులకు అందజేయాలని సూచించారు. అనంతం గ్రీన్‌ అంబాసిడర్స్‌కు కొత్త బట్టలు, కొబ్బరినూనె, సోపులు అందజేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మండల డెవలప్‌మెంట్‌ అధికారి పి.శ్రీనివాస్‌, విస్తరణ అధికారి జవహర్‌లాల్‌ నెహ్రూ, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌, స్వచ్ఛ భారత్‌ మిషన్‌ మండల కో–ఆర్డినేటర్‌ వి.రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌ విద్యార్థిని అదృశ్యం

తెనాలి రూరల్: ఇంటర్‌ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదైంది. పట్టణంలోని చెంచుపేటకు చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటర్‌ ఫస్టియర్‌ చదువుతోంది. ఇంటి నుంచి కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను గురువారం ఆశ్రయించారు. వన్‌ టౌన్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధం

తెనాలి అర్బన్: బహిరంగ మల,మూత్ర విసర్జనరహితంగా పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్‌ కమిషనర్‌ బండి శేషన్న గురువారంఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెనాలి పట్టణంలో బహిరంగ మల మూత్ర విసర్జనను నిషేధించినట్లు ప్రకటించారు. అందుకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై రూ.500 జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. ప్రజలందరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఆయన సూచించారు.

సైబర్‌ నేరాలపై అవగాహన అవసరం

పాతబొమ్మువానిపాలెం(కొల్లిపర): సైబర్‌ నేరాలపై మహిళలు, రైతులు అవగాహన పెంచుకోవాలని తెనాలి రూరల్‌ సీఐ బెల్లం శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పాతబొమ్మువానిపాలెంలో గురువారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు. డ్వాక్రా మహిళలకు, రైతులకు సైబర్‌ నేరాలతో పాటు అవి జరిగే విధానాన్ని వివరించారు. బ్యాంకుల నుంచి డబ్బులు తెచ్చే సమయంలో అపరిచితులతో, అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మాయ మాటలు నమ్మవద్దని, అనుమానం వస్తే వెంటనే అక్కడ ఉన్న బ్యాంకు మేనేజర్‌ గానీ దగ్గరలో ఉన్న పోలీస్‌ స్టేషన్‌లో గానీ సమాచారం అందించాలని సూచించారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీలు చెప్పమని అడిగే వారితో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు సైబర్‌ నేరాల్లో రకాలు, నేరగాళ్ల మోసాల గురించి వీడియోలు ద్వారా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కొల్లి రజిని, ఎంపీటీసీ తుమాటి భీమారాణి , ఏఎస్‌ఐ పోతురాజు, సిబ్బంది తాతారావు, కూర్మారావు, నాగబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రెయిన్లపై యథేచ్ఛగా ఆక్రమణలు

- 500 మీటర్ల పొడవున డ్రైనేజీ మూసివేత
- కార్పొరేషన్‌ కార్మికులకు తిప్పలు



ఆక్రమణకు గురైన డ్రైనేజీపై వేసిన కాంక్రీట్‌ ప్లేట్లను తొలగించి పూడిక తీస్తున్న పారిశుధ్య కార్మికులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో మంగళగిరి ప్రకాశం బ్యారేజ్‌ పాత జాతీయ రహదారి వెంబడి శర్మ దాబా దగ్గర నుంచి చేనేత జౌళిశాఖ కార్యాలయం వరకు సుమారు 500 మీటర్ల పొడవున డ్రైనేజీని పలు హోటళ్ల యజమానులు ఆక్రమించుకుని పూర్తిగా మూసివేడయంతో ఆ ప్రాంతంలోని నివాసాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన మురుగు, హోటళ్ల నుంచి వచ్చే మురుగు బయటకు పారక ఆగిపోతోంది. హోటల్‌ యజమానులు పూర్తిగా డ్రైనేజీలపై కాంక్రీట్‌తో మూసివేయడంతో ఇబ్బంది తలెత్తుతోంది. డ్రైనేజీ సమస్యపై కార్పొరేషన్‌ కార్యాలయానికి వినతి పత్రాలు అందడంతో వేసిన కాంక్రీట్‌ దిమ్మలను తొలగించి కాలువలో పూడిక తీయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీల ఆక్రమణలు అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రెవెన్యూ సదస్సులపై సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్‌ సీతారామయ్య

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్‌ ప్రాంతాల్లో జరిగే రెవెన్యూ సదస్సులపై తాడేపల్లి తహసీల్దార్‌ సీతారామయ్య గురువారం నులకపేటలోని తన కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతోను, వివిధ శాఖల అధికారుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి రూరల్‌పరిధిలోని 8 గ్రామాల్లోను, తాడేపల్లి పట్టణ పరిధిలోను రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ ఆదేశాల మేరకు ప్రతి ప్రాంతంలో సదస్సులు నిర్వహించి రైతుల పంట భూములకు ఉన్న వివిధ రకాల సమస్యలను పరిష్కరిస్తారని, ఈ సదస్సులో రెవెన్యూ అధికారులతో పాటు దేవదాయ శాఖ అధికారులు, రిజిస్ట్రేషన్‌ కార్యాలయ అధికారులు పాల్గొంటారని, రైతుల దగ్గర నుంచి వినతులను స్వీకరించి సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరిస్తామని, చిన్నచిన్న సమస్యలు ఉంటే అక్కడే సరిచేసి రైతులకు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ఆర్‌ఐ వేదాంతరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో మార్పులు..

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ రూరల్‌ పరిధిలో నేటి నుంచి జరుగనున్న రెవెన్యూ సదస్సులో మార్పులు చేస్తూ తాడేపల్లి తహసీల్దార్‌ సీతారామయ్య గురువారం మరోసారి షెడ్యూల్‌ విడుదలచేశారు. ఈ షెడ్యూల్‌ ప్రకారం సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం లేదు. మిగిలిన గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నారు. 6వ తేదీ వడ్డేశ్వరం, 12న కుంచనపల్లి, 13 గుండిమెడ, 17 తాడేపల్లి టౌన్‌, 19 ఇప్పటం, 21 మెల్లెంపూడి, ఇప్పటం, 24వ తేదీ కొలనుకొండ, 27 ప్రాతూరు, గుండిమెడ, 28వ తేదీ చిర్రావూరులో నిర్వహించనున్నారని తెలిపారు.

నేటి నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

తాడికొండ: నేటి నుంచి తాడికొండ మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు షెడ్యూల్‌ విడుదల చేసినట్లు తహసీల్దార్‌ కె.నాసరయ్య తెలిపారు. ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలనే ప్రాథమిక లక్ష్యంతో ప్రభుత్వం ఈ సదస్సులు ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించిన బృందం ప్రతి గ్రామంలో అర్జీలు స్వీకరిస్తుందన్నారు. ఈ దిగువ తెలిపిన షెడ్యూల్‌లో ప్రజలు తమ సమస్యలు విన్నవించాలని సూచించారు. ఈనెల 6వ తేదీన కంతేరు, 10న మోతడక, 12న లచ్చన్నగుడిపూడి, 13 బేజాత్పురం, 17 ముక్కామల, 18 పాములపాడు, 20 రావెల, 24 గరికపాడు, 26 బండారుపల్లి, 27 ఫణిదరం, 31న దామరపల్లి, జనవరి 2న తాడికొండ, 3న నిడుముక్కల, 7న లాం, 8న పొన్నెకల్లు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్‌ తెలిపారు.

రైతులకు భూసార పరిరక్షణపై అవగాహన



జీవామృతం తయారు చేసుకునే విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయ అధికారిణి పి.శిరీష



రేపూడిలో రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేస్తున్న ఏఓ వాసంతి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని గొడవర్రు గ్రామంలో ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా రైతులకు భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిణి పి.శిరీష మాట్లాడుతూ ఇష్టం వచ్చినట్లు రసాయనిక ఎరువులు వాడడం వలన భూమి సారాన్ని కోల్పోతోందని, భూసార పరిరక్షణపై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని, అవసరమైన మోతాదులో రసాయన ఎరువులు వాడాలని, పశువుల ఎరువు, వానపాముల ఎరువు, జీవన ఎరువులను తప్పని సరిగా వినియోగించాలని సూచించారు. ఘన మరియు ద్రవ జీవామృతాలను నేలకు అందించడం వలన నేలలో వున్న సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయని, మొక్కల పెరుగుదల, దిగుబడి పెరుగుతుందని రైతులకు వివరించారు. అనంతరం రైతులకు ద్రవ మరియు ఘన జీవామృతం ఎలా తయారు చేసుకోవాలో తయారు చేసి చూపించారు. ప్రకృతి వ్యవసాయ రైతులు, ఐసీఆర్‌పీలు, ఫార్మర్‌ సైంటిస్ట్‌ దిలీప్‌, వీఏఏ పవన్‌, రైతులు పాల్గొన్నారు.

సారవంతమైన భూమితో అధిక దిగుబడులు..

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామంలో ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ వాసంతి మాట్లాడుతూ పంటలు పండేందుకు సారవంతమైన భూమి అవసరం అన్నారు. అందుకుగాను భూమి ఆరోగ్యాన్ని కాపాడడానికి వానపాముల ఎరువు, పశువుల ఎరువు తోడ్పడుతుందని, అంతేగాక పచ్చిరొట్ట ఎరువు జనుము, జీలుగా పిల్లి పెసర లాంటి ఎరువులను ప్రధాన పంటకు ముందు సాగు చేసి నేలలో కలియదున్నాలన్నారు. దీనివలన రసాయన ఎరువుల మోతాదును తగ్గించుకోవడమే కాకుండా నాణ్యమైన పంటలు పంటల దిగుబడి సాధించవచ్చు అని చెప్పారు. అనంతరం రైతులకు భూసార పరీక్షా పత్రాలను అందజేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు సాంబశివరావు, కిరణ్‌, శివారెడ్డి, మల్లిక, వ్యవసాయ విస్తరణ అధికారులు సింధూర, షేక్‌ సుభానిలు పాల్గొన్నారు.

డ్రెయిన్ల నిర్వహణపై చైర్‌పర్సన్‌ ఆగ్రహం



తెనాలి అర్బన్: మురుగు కాల్వలను బాగు చేసి ఎంత కాలమైంది.. కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి.. ఇలా ఉంటే వ్యాధులు ప్రబలవా? అంటూ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తాడిబోయిన రాధిక ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 22వ వార్డులో గురువారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వలు అధ్వానంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజుబాగు చేయాలని సూచించారు. ఆమె వెంట అసిస్టెంట్‌ కమిషనర్‌ వి.ఎం.లక్ష్మీపతి, కౌన్సిలర్‌ షేక్‌ దుబాయ్‌బాబు, ఆరోగ్యాధికారిణి డాక్టర్‌ కె.హెలెన్‌ నిర్మల, టీపీవో సాంబశివరావు, ఏఈ సునీల్‌కుమార్‌ ఉన్నారు.